క్లుప్తంగా

ఉచిత దంత పరీక్షలు



దంత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని రాయిపేట చినిమిల్లి డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకుడు, గౌతమి విద్యాసంస్థల అధినేత చినిమిల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చినిమిల్లి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సేవా దృక్పథంలో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులకు ఉచితంగా రక్త పరీక్షలు చేయిస్తున్నామన్నారు. బయటి వారికి కూడా కేవలం నామమాత్రపు ఫీజులతో రక్త పరీక్షలు చేయిస్తున్నామని చెప్పారు. దంత వైద్య శిబిరంలో డాక్టర్ కె.రవిరాజు, డాక్టర్ కె.ఉదయిని పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌతమి విద్యాసంస్థల సూపరిండెంట్ ఎండీ ఘఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరిణిగానే కొఠాలపర్రు చెరువు



ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు విజ్ఞప్తి చేస్తున్న గ్రామస్తులు

పెనుగొండ: కొఠాలపర్రులో ఇటీవల అభివృద్ధి చేసిన చెరువును కేశవస్వామి పుష్కరిణిగానే ఉంచాలని కొఠాలపర్రు గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు సోమవారం తూర్పుపాలెంలో కలిసి విజ్ఞప్తి చేశారు. రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కేశవస్వామికి పూర్వకాలం నుంచి ఇదే చెరువు నుంచి తీర్థపు బిందెను తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. ప్రజల కోరిక మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పుష్కరిణిగానే అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, జిల్లా కార్యదర్శి కాకిలేటి బాపిరాజు, దివి గణపతి పాల్గొన్నారు.

నేలకొరిగిన స్వర్ణ చేలు



బ్రాహ్మణచెర్వులో నేలకొరిగిన పంటచేలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి స్వర్ణ రకం పంట నేలవాలింది. మండలంలో 12 వేల ఎకరాల్లో స్వర్ణ వరి రకాన్ని రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. రెండు రోజుల్లో కోతలు ప్రారంభం కానుండగా సోమవారం కురిసిన వర్షం ఈదురుగాలులకు సర్ణరకం చేలు నేలనంటడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

కాళ్ల: తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు సోమవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కలవపూడి గ్రామానికి చెందిన చిన్నం బేబీ బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లింది. భర్త రాజశేఖర్ ఇంటి వద్దనే ఉంటూ తన ఇద్దరు పిల్లల్ని చూసుకుంటున్నాడు. ఈ నెల 2వ తేదీన రాత్రి సుమారు 10 గంటల సమయంలో రాజశేఖర్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయినట్లు భార్య బేబికి సమాచారం అందింది. దీంతో గల్ఫ్ నుంచి వచ్చిన భార్య ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రేపు యూపీఏ సమావేశం

ఉండి: అర్తమూరులోని పాస్టర్ వైజే ప్రసాద్ హోలీగాడ్ మినిస్ట్రీస్ చర్చిలో యూపీఏ మండల సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈలి డేవిడ్ మార్క్ సోమవారం తెలిపారు. మండలంలోని సభ్యులంతా విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని పీపీ రోడ్డులో జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ అడబాల శ్రీను సోమవారం చెప్పారు. నిందితుల నుంచి రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కేంద్రం తీరుపై సీపీఎం నిరసన

ఉండి: భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకు భంగం కలిగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యం లో యండగండిలో సోమవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తే వారిపై తప్పుడు కేసులు మోపడం సరికాదన్నారు. ఢిల్లీ మీడియా ప్రతినిధులపై పెట్టిన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీల ప్రతులను తగులబెట్టారు. దనికొండ శ్రీనివాస్, తవిటినాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



పాలకొల్లులో కేక్ కట్ చేస్తున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



యలమంచిలి నాయకులు, కార్యకర్తలతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి. చిత్రంలో గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: ప్రజాసంకల్ప యాత్ర ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకొల్లులో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి హాజరుకావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషబాబు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

ఎంపీ మిథున్‌రెడ్డి పాలకొల్లు విచ్చేసిన సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, పాత్తూరి బుచ్చిరాజు, పితాని సత్యనారాయణ (చిన్న), పార్టీ నాయకులు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, మానుకొండ శ్రీనుబాబు, ఖండవల్లి వాసు, చిట్టూరి ఏడుకొండలు, ఉచ్చుల స్టాలిన్, కర్రా జయసరిత, మద్దా చంద్రకళ, బండి రమేష్, ఎం మైఖేల్‌రాజు, సాలా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానాకు రూ.కోటి నిధులివ్వాలని వినతి

- ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన ముస్లిం సంఘ పెద్దలు



ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంఘ పెద్దలు

పాలకొల్లు అర్బన్: పూలపల్లిలో అసంపూర్తిగా నిలిచిన ముస్లిం షాదిఖానా నిర్మాణానికి రూ.కోటి నిధులివ్వాలని ముస్లిం సంఘ పెద్దలు వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కోరారు. సోమవారం పాలకొల్లు వచ్చిన ఎంపీని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో సున్ని జామియా మసీదు మాజీ ట్రస్టీ షేక్ మహ్మద్ రఫీ, ట్రస్టీ షేక్ వలీ, నూర్ బాషా సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ చాంద్‌బీబీ, సంఘ పెద్దలు షేక్ సాగస్ సాహెబ్, షేక్ చాన్ బాషా, షేక్ బాజీ కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్ధి



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ తమ్మయ్య

పెనుగొండ: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో పెనుగొండకు చెందిన లబ్ధిదారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెరుకువాడ కుమ్మరి వీధిలో రహదారి నిర్మాణం చేయించిన శ్రీరంగనాథరాజును మహిళలు ఘనంగా సత్కరించారు. సొంతింటి కల నెరవేరడానికి సీఎం జగన్ పేదలకు అండగా నిలిచారన్నారు. డ్రెయినేజీ నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, కుడిపూడి సుబ్రహ్మణ్యం, వాసంశెట్టి బుచ్చిబాబు, కండిబోయిన అయ్యప్ప, లంక శంకరరావు, నూకరాజు, కడలి శ్రీను, నక్కాకృష్ణ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురాజు

ఆకివీడు: బాణసంచా విక్రయాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు చెప్పారు. స్థానిక సీఎం హైస్కూల్ ఆవరణలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఆర్డీఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలను కచ్చితంగా అమలుజేయాలన్నారు. ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 120 మంది తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, 15 మంది పర్మినెంట్ లైసెన్సు దారులున్నారని చెప్పారు. ఆయా పర్మినెంట్ లైసెన్సు హోల్డర్ల షాపులు, గొడౌన్‌లను పరిశీలించినట్లు, తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఏర్పాటు చేయబోయే దుకాణాల ప్రాంతాల్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆయా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించే విధంగా మండల రెవెన్యూ అధికారులకు తగిన సూచనలిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ విజయలక్ష్మి, ఆర్.సూర్యనారాయణ, రిటైల్ వర్తకుల సంఘ ప్రతినిధి అందే రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా బేతాళ ఉత్సవం



వీరవాసరంలో గజ వాహనంపై ఊరేగుతున్న బేతాళుడు



బేతాళ ఉత్సవంలో విచిత్ర వేషధారణల్లో కళాకారుల ప్రదర్శనలు

వీరవాసరం: వీరవాసరం గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 151వ ఏనుగు సంబరం బేతాళ ఉత్సవం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో, బాణసంచా కాల్పులు మధ్య బేతాళుని గజావాహనంపై ఉంచి ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, తీన్మార్ నృత్యాలు, కోలాట ప్రదర్శన, మ్యూజికల్ బ్యాండ్ మేళాలతో బేతాళ ఉత్సవాలు అత్యంత వేడుకగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భీమవరం రూరల్ సీఐ వై.సత్య కిషోర్, ఎస్సై పి.రమేష్, ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

దంతాల సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు

పెనుమంట్ర: దంతాల సంరక్షణను నిర్లక్ష్యం చేయరాదని, ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని వైద్య నిపుణులు శ్రీకాంత్ అన్నారు. సోమవారం పెనుమంట్ర విజయా ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో విష్ణు డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ తేతలి సంజీవరెడ్డి దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నారులకు దంతాల శుభ్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రత్యూష వైద్యపరీక్షలు నిర్వహించారు.

వెలగలేరులో..

పెనుమంట్ర: వెలగలేరులో సంఘమిత్ర స్కూల్ విద్యార్థులకు సోమవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, పెనుగొండ రత్న డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మేడపాటి మురళిజోగిరెడ్డి విద్యార్థులకు పంటి సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ కొవ్వూరి మధువాణి, విజయకుమార్‌రెడ్డి, మానవతా జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, చైర్మన్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, సంఘమిత్ర కరస్పాండెంట్ కె.సతీష్‌వర్మ, ప్రిన్సిపాల్ సుందరాచార్యులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.65 లక్షలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా, రూ.2,65,096 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ చెప్పారు. సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం డివిజన్ అధికారి వర్ధినీడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీలు లెక్కించగా, మూడు నెలలకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ట్రస్టీలు రేలంగి నరసింహమూర్తి, దాసరి దివ్యశ్రీ, గుండుబోయిన అరుణకుమారి, మాజేటి మంగాకుమారి, తాతపూడి శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు సీపీఎం రక్షణ భేరి సభ

నరసాపురం: లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని సమాజం నినాదంతో సీపీఎం చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం నరసాపురం చేరుకుంటుందని సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు స్టీమర్‌రోడ్డులో బహిరంగ సభ జరుగుతుందని, సభలో పార్టీ రాష్ట్ర నేతలు పాల్గొంటారన్నారు.

ఘనంగా అన్నసమారాధన

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో గొంతమ్మ, నందమ్మ పండుగను పురస్కరించుకుని సోమవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. దళితవాడ రామాలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. గొంతమ్మ, నందమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అన్నదానం జరిపారు. ఈసందర్భంగా రామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో బాబ్జిరాజు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను ఎంపీడీవో బాబ్జిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 సంవత్సరాల మధ్యకాలంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన 1254 పనులకు సంబంధించి రూ.4.69 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన రూ.2.74 కోట్ల విలువైన 47 పనులకు సంబంధించి గత వారం రోజుల నుంచి ఆయా గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీల వారీగా పనుల వివరాలను, ఖర్చయిన మొత్తాన్ని కూడా జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను చదివి వినిపించారు. సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి గుర్తించిన అవకతవకలపై కూడా చర్చించారు. తనిఖీలో అధికంగా వాడిన రూ.3,164 రికవరీ చేసి అందుకు జరిమానాగా రూ.6 వేలు విధించారు. డీవీవో విజయలక్ష్మి, ఏపీఈ సాగర్, డీపీఎం మురళీకృష్ణ, ఎంపీడీవో బాబ్జిరాజు, ఎస్ఆర్పీ మన్మథరావు, పీఆర్ జేఈ సీహెచ్ అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలన చరిత్రలో సువర్ణాధ్యాయం



పెనుమదంలో సామాజిక సాధికార బస్సు యాత్రపై ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి పితాని సత్యనారాయణ (చిన్నా) అన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఈ నెల 8వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రపై సోమవారం ఆయన పెనుమదం శివారు అల్లంగుంట, దంపనబోయినగరువు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా అందిస్తున్న పరిపాలనపై ప్రజలను చైతన్యం చేయడమే సామాజిక సాధికార బస్సు యాత్ర లక్ష్యమన్నారు. సొసైటీ చైర్మన్ కొర్రపాటి వీరాస్వామి, గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు, బీరా రాజశేఖర్, దొంగ భాస్కరరావు, బొడ్డు బాబి, గుబ్బల ఆంజనేయులు, గూడూరి రాము, జుత్తుగ దానయ్య పాల్గొన్నారు.

బ్రహ్మారావు సేవలు మరువలేనివి

పెంటపాడు: సర్పంచ్‌గా, ఉన్నత విలువలు కలిగిన రాజకీయ నేతగా చీర్ల బ్రహ్మారావు సేవలు మరువలేనివని, ఆయన మృతి తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన చీర్లబ్రహ్మారావు విగ్రహావిష్కరణ సోమవారం సాయంత్రం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొట్టు సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్‌గా బ్రహ్మారావు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తణుకుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు చీర్ల రాధయ్య, గూడెంకు చెందిన ప్రముఖులు యోగ్గిన నాగబాబు, పసల అచ్యుతం, పసల కొండ, భీమడోలు ఏవో చీర్ల రావికుమార్, బ్రహ్మారావు కుటుంబసభ్యులతో పాటు, పార్టీ నాయకులు వీర్ల గోవింద్, వీర్ల వెంకటేష్, వీర్ల సత్యనారాయణ, తూము చిన్న, ఆకుల రామచంద్రరావు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రవీణ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా కామేష్

తణుకు అర్బన్: న్యాయవాదుల సంఘ అభివృద్ధికి అండగా ఉంటానని పశ్చిమ గోదావరి జిల్లా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. తణుకులో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా సూరంపూడి కామేష్‌ను తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తికున్న గౌరవాన్ని కాపాడుతూ జూనియర్ న్యాయవాదులకు తమ వృత్తిలో అభివృద్ధి చెందే విధంగా తోడ్పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వి.గోవిందరావు, జి.అంబేత్, కేవీవీఎస్ మూర్తి, కామన మునిస్వామి, పొట్ల సురేష్, సీహెచ్ నాగేశ్వరరావు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వాలో పీఆర్ -126 రకం సాగు చేపట్టవద్దు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్ వెంకటేశ్వరరావు

అత్తిలి: దాళ్వాసీజన్‌లో పీఆర్-126 రకం వరివంగడం సాగును చేపట్టవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్ వెంకటేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. దాళ్వాసాగుకు అధికమంది రైతులు పీఆర్-126 రకం సాగు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఎవరైనా రైతులు ఈరకం సాగుచేసిన వారు ధాన్యాన్ని ప్రైవేటుగా మాత్రమే అమ్ముకోవాలని చెప్పారు. ప్రభుత్వం పీఆర్ 126 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయదని తెలిపారు. రైతులు వరినాట్లు వేసే పద్ధతి కాకుండా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిని అలవాటు చేసుకోవాలని సూచించారు. దీనిద్వారా నీటివినియోగం, కూలి ఖర్చులు, 7 రోజులు పంటకాలం తగ్గించుకోవచ్చన్నారు. రైతులు దాళ్వాసాగులో వ్యవసాయశాఖ తెలిపే సూచనలు పాటిస్తూ, మంచి దిగుబడులు సాధించుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు.

రహదారులే డంపింగ్ యార్డులు

- పాలకోడేరు మండలంలోని గ్రామాల్లో దుస్థితి
- గ్రామాల్లో మెరుగుపడని పారిశుధ్య నిర్వహణ



శృంగవృక్షంలో రహదారిలో వేసిన చెత్తకుప్పలు

పాలకోడేరు: మండలంలోని అనేక ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులుగా తలపిస్తున్నాయి. ఇష్టానుసారంగా రోడ్ల మార్జిన్లు చెత్తకుప్పలతో నిండిపోయాయి. మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించడంపై ఇటీవల సాక్షాత్తు కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక ఓ పంచాయతీ కార్యదర్శిని, ఎంపీడీఓను ప్రభుత్వానికి సరెండర్ చేసినా కింది స్థాయి అధికారుల్లో మార్పు కనిపించకపోవడం, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపడకపోవడం గమనార్హం. పరిసరాల పరిశుభ్రత కోసం గ్రామాల్లో ఎక్కడా చెత్తకుప్పల కనపడకూడదని, ఎక్కడికక్కడ డంపింగ్ యార్డులను భారీ ఖర్చుతో నిర్మించారు. ఈ డంపింగ్ యార్డ్‌లను స్థానిక పంచాయతీ అధికారులు నిరుపయోగంగా వదిలేయడంతో గ్రామాల్లో వెలువడుతున్న వ్యర్థాలు చెత్తకుప్పలను రహదారుల అంచులలో వేసి తగలబెడుతున్నారు. క్షేత్రస్థాయిలో చెత్తకుప్పలను సంపద కేంద్రాలు తరలించకుండా కాలువలు పక్కన, రహదారులు పక్కన వేస్తూ కాలుష్యానికి ప్రధాన కారకులుగా మారుతున్నారు. ఉండి కాలవ వెంబడి గరగపర్రు, గొల్లలకోడేరు ప్రాంతాల్లో వేస్తున్న చెత్త కుప్పలతో తాగునీరు కలుషితంగా మారుతోంది. ఈ వ్యర్థాల కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్యాలపాలవుతున్నారు. పాలకోడేరు, మోగల్లు, పెన్నాడ, శృంగవృక్షం, గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో రహదారుల వెంబడి చెత్తకుప్పలకు తరచూ నిప్పు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తుప్పుపట్టిపోతున్న చెత్త తరలించే రిక్షాలు

మండలంలో పదుల సంఖ్యలో కొత్త చెత్త రిక్షాలు, విద్యుత్తుతో నడిచే రిక్షాలు ఉన్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఈ రిక్షాలు ఆయా పంచాయతీ కార్యాలయాల సమీపంలోని ఉపయోగించకుండానే తుప్పుపట్టి పాడైపోతున్నాయి. చెత్తరిక్షాలను, డంపింగ్ యార్డ్‌లను ఉపయోగంలోకి తీసుకువస్తే, సమస్యకు కొంత పరిష్కారం లభించే అవకాశం ఉన్నా అధికారులకు పట్టడం లేదు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో చెత్త, వ్యర్థాలను రహదారులు, కాలువలు పక్కన వేయకుండా డంపింగ్ యార్డులకు తరలించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

– కె.నాగేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో